# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవడం సాధ్యం కాదు

ప్రస్తుతం ఉన్న భూగర్భజలాలు, మాకున్న భూముల్లో సాగు చేసే పంటల ప్రకారం 5 హెచ్‌పీ మోటర్లు వాడడమే కరెక్ట్. 10 హెచ్‌పీ మోటర్లు సాధ్యం కాదు. సాగుకు మూడు గంటల కంటు చాలంటున్న కాంగ్రెస్ వాళ్లు 5 హెచ్‌పీ మోటర్లతో మూడు గంటల కరెంటుతో సాగు ఎలా చేస్తారనేది తెలియకుండా మాట్లాడుతున్నరు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తోనే సరిపోను సాగునీరు అందుతున్నయ్. గతంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, తెలియక బోర్లు బావుల రాత్రి పగలు కాపలా కాసేటోళ్లం. ఓవర్‌లోడ్‌తో మోటర్లు కాలిపోయి.. సరిగా నీరందక సగం పంటలు ఎండిపోయేది. తెలంగాణ వచ్చినంక శాన నిమ్మలమైంది. సరిపోను కరెంట్ ఉంటుండడంతో రెండు పంటలు పండించుకుంటున్నం. మళ్లీ తెలంగాణ సర్కారు వస్తేనే కరెంట్ కష్టాలు లేకుండా ఉంటయ్.

**– రమావత్ కృష్ణ, పిల్లిగుండ్ల తండా, పీఏపల్లి**



**మూడు గంటల విద్యుత్‌పై మండిపడుతున్న రైతాంగం**

**24 గంటలు సరఫరా చేసే సర్కారు కావాలంటున్న అన్నదాతలు**





## కాంగ్రెసోళ్లను నమ్ముకుంటే కాటికే



వ్యవసాయానికి మూడు గంటల కరెంటిస్తామంటున్న కాంగ్రెస్ వాళ్లను గెలిపిస్తే వ్యవసాయం కాటికి చేరడం ఖాయం. తెలంగాణ వచ్చినప్పటి నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌తో సరిపోను నీరంది పంటలు పండించుకుంటున్నం. మూడు గంటల కరెంటుకు ఎకరం మడి కూడా తడువదు. అధికారం కోసం మాయ మాటలు చెప్పే కాంగ్రెస్‌ను నమ్మితే రైతులు నట్టేట మునగక తప్పదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు సరిగా కరెంటు ఇవ్వక నానా అవస్థలు పడ్డం. కరెంటు కోసం రాత్రింబవళ్లు కరెంటు కోసం బోరు బావుల దగ్గర పడిగాపులు కాసినం. పాము కాటు, విద్యుత్ షాక్‌తో చాలా మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబాలు వీధిన పడ్డాయి. సీఎం కేసీఆర్ 24 గంటల కరెంట్‌తో పాటు రైతుబంధు, రైతుబీమా ఇస్తుండడంతో రైతులు సంతోషంగా ఉన్నరు. రైతు మేలు కోరే బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే మేమంతా అండగా ఉంటాం. ఆ పార్టీకి ఓటు వేసి బరాబర్ గెలిపిస్తాం.

**– లకుమాల మధుబాబు, రైతు, ఎర్రబెల్లి, నిడమనూరు**

# కాంగ్రెస్ వద్దు.. కరెంట్ కావాలె



## మళ్లీ కరెంట్ కష్టాలు మాకొద్దు

తెలంగాణ రాక ముందు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నం, ఆ నాటి గోస తలుచుకుంటేనే వ్యవసాయం చేయాలంటే భయమైతది. కరెంట్ ఎప్పుడు వస్తదో తెల్వకపోయేది. రాత్రి మొత్తం బాయికాడనే కరెంటు కోసం ఎదురు చూసేటోళ్లం. తెలంగాణ వచ్చినం సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు వస్తున్నది. దాంతో పగటి పూటే సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నం. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ వాళ్లు 3 గంటల కరెంటు చాలు అంటున్నరు. అసోంటోళ్లను నమ్ముకొని వ్యవసాయం చేయలేం. రైతు, ఎవుసాయం విలువ తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్ ఉంటేనే మాలాంటి రైతులు బతుకగలుగుతరు. మళ్లీ ఆయనే సీఎం కావాలి.

**– నేనావత్ లచ్యానాయక్, రైతు, మర్రిచెట్టుతండా, దేవరకొండ రూరల్**

> కల్లబొల్లి మాటలు చెప్పే కాంగ్రెస్ వద్దు.. 24 గంటల నాణ్యమైన కరెంటు ఇచ్చే సర్కారు కావాలని రైతన్నలు కోరుతున్నారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ చాలు.. 10హెచ్‌పీ మోటర్లు వాడాలంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులపై అన్నదాతలు మండిపడుతున్నారు. మూడు గంటల కరెంట్‌తో ఒక్క మూలైనా తడుస్తదా? అని ప్రశ్నిస్తున్నారు. అసలు వ్యవసాయం గురించి తెలుసా.. మూడు గంటల కరెంటు ఇస్తే సాగు బంద్ చేయాల్సి వస్తదని ఆందోళన చెందుతున్నారు. గతంలో పంటలు పండించడానికి అష్టకష్టాలు పడ్డామని, ఇప్పుడు నిరంతర విద్యుత్‌తో నిమ్మలంగా ఉన్నామని, మళ్లీ గత పాలన తెచ్చి తమ బతుకులను ఆగం చేసుకోబోమని తేల్చి చెబుతున్నారు.



## కాంగ్రెస్ వస్తే మళ్లీ రైతు ఆత్మహత్యలే

గతంల కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి సరిగ కరెంటు ఇవ్వక.. పంటలు ఎండిపోయి అప్పులు పెరిగి రైతులు ఆత్మహత్య చేసుకున్నరు. వారి కుటుంబాలు ఆగమైనా అప్పటి పాలకులు పట్టించుకోలే. తెలంగాణ వచ్చినంక సీఎం కేసీఆర్ వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తుండడంతో రైతులు కంటినిండా నిద్రపోయి, గుండె మీద చేయివేసుకొని బతుకుతున్నరు. పంట పెట్టుబడి, సరిపోయేంత నీళ్లు ఉండడంతో రెండు పంటలు పండించుకుంటున్నం. చేతిలో నాలుగు పైసలు కనిపిస్తున్నయ్. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు మూడు గంటల కరెంట్ ఇస్తమంటు చెబుతున్నరు. అప్పట్లో కాంగ్రెస్‌వాళ్లు ఇచ్చిన కరెంట్‌తో కుటుంబాలను వదిలి బిక్కుబిక్కుమంటూ రాత్రి పొలాలకాడ కావలి కాసినం. ఇప్పుడు మళ్లీ అలాంటి రోజులు మాకొద్దు. మూడు గంటల కరెంటిచ్చే వాళ్లు మాకక్కరలేదు. 24 గంటల కరెంటిచ్చే సీఎం కేసీఆర్‌కే మా మద్దతు.

**– బంటు సతీశ్, యాద్గార్‌పల్లి, మిర్యాలగూడ టౌన్**



## కరెంటు కోసం ఎదురుచూసే రోజులు మళ్లీ వద్దు

గతంలో కరెంటు ఎప్పుడొస్తదా అని పొలం కాడనే ఉండి ఎదురు చూసేటోళ్లం. మా నాయన రాత్రి పూట బాయికాడనే పడుకునేటోడు. అంతగా కాపలా కాసి నీళ్లు పెట్టినా సగమే పారేవి. తెలంగాణ వచ్చినంక అటువంటి కష్టాలు లేకుండా పోయినయ్. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తుండడంతో పొలానికి నీళ్లు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఉదయం పూటనే వచ్చి పెట్టుకుంటున్నం. నీళ్లు కూడా సరిగా పారుతుండడంతో పొలం మొత్తం పారుతున్నది. రైతులు సంతోషంగా ఉన్నరు. కాంగ్రెస్ వాళ్లు వ్యవసాయానికి మూడు గంటలే చాలంటున్నరు. వాళ్లను నమ్ముకుంటే మళ్లీ పాత కష్టాలే అనుభవించాల్సి వస్తది. మునుపటి రోజులు మళ్లీ మాకొద్దు. మా కష్టాలను గుర్తించి 24 గంటల కరెంట్ ఇస్తున్న వారినే గెలిపించుకుంటాం.

**– పాగుగంటి భిక్షం, దామెర, నాంపల్లి మండలం**

## కాంగ్రెస్‌ను నమ్ముకుంటే పొలంగట్ల మీద పడుకోవాల్సిందే

ఆ నాటి కాంగ్రెస్ పాలన గుర్తు చేసుకుంటేనే భయమైతది. కరెంట్ కోసం పొలం గట్లమీద పడుకున్నం. రాత్రి పగలు పొలం కాడనే ఉండి నీల్లు పెట్టుకున్నం. తెలంగాణ ఏర్పాటయ్యాకే సీఎం కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండడంతో రైతుల కష్టాలు తప్పాయి. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను మళ్లీ కాంగ్రెస్ వాళ్లకు అప్పగించి మేము ఇబ్బంది పడలేం. వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలు అంటున్న రేవంత్‌రెడ్డి అసలు వ్యవసాయం చేస్తే తెలుస్తది రైతుల కష్టాలేంటివనేది. సీఎం కేసీఆర్ పాలనతో రైతుల కష్టాలు తీరినై అనుకుంటుంటే మళ్లీ రేవంత్ లాంటోళ్లు వచ్చి ఏదో చెబుతున్నరు. వారి మాటలను నమ్మి మళ్లీ మోసపోలేం. కాంగ్రెస్ పాలన అస్సలొద్దు. రైతులమంతా కలిసి బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటం.

**– కొప్పు పెద్ద శ్రీను, చందుపట్ల, నకిరేకల్**



## 10 హెచ్‌పీ మోటర్లను రైతులు భరించలేరు




బావులకాడ 10 హెచ్‌పీ మోటర్లను పెట్టుకుంటే మూడు గంటలే సరిపోతయ్ అంటూ కాంగ్రెస్ నాయకులు చెబుతున్నరు. అసలు 10 హెచ్‌పీ మోటర్లంటేనే రైతులకు తెలియదు. లక్షలు పెట్టి పెద్ద మోటరు కొనడం రైతుకు సాధ్యం కాదు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే ఇప్పుడున్న టాన్స్‌ఫార్మర్లు సరిపోవు. ఇంకా కావాలి. ఇవన్నీ ఎట్లా సాధ్యం. రైతులు 3, 5 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని సంబురంగా వ్యవసాయం చేస్తున్నరు. ఇప్పుడొచ్చి కాంగ్రెస్ వాళ్లు ఏదో మాయ మాటలు చెప్పి రైతులను మళ్లీ కష్టాల పాలు చేసేందుకు కుట్ర చేస్తున్నరు. వ్యవసాయం తెల్వని రేవంత్‌రెడ్డి 3 గంటలు కరెంట్ సాలని ఇష్టమొచ్చినట్లు చెబుతున్నడు. ఓట్ల కోసం రైతులను మోసం చేయాలనే చూస్తే ఊరుకునేది లేదు. మూడు గంటల కరెంట్ వద్దు ... కాంగ్రెస్ పాలన వద్దు సీఎం కేసీఆర్‌ను మళ్లీ గెలిపించుకుంటం.

**–గాదె రాజశేఖర్‌రెడ్డి, రైతు, నల్లగొండ మండలం**



**ధరణి తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తది. పటేల్, పట్వారీల వ్యవస్థతో ఇబ్బందులు పడాలె. వీటిని మేము అంగీకరించం. అంటూ రైతులు ముక్త కంఠంతో చెబుతున్నరు. ధరణి పోర్టల్‌తో భూ సమస్యలు తీరిపోయి.. రైతులు సంతోషంగా ఉండడం నచ్చని కాంగ్రెస్ ధరణిని రద్దు చేయాలని కుట్రలు చేస్తున్నది. పాత పటేల్, పట్వారీ వ్యవస్థను తీసుకొస్తమంటూ డ్రామాలు ఆడుతున్నది. ధరణి పోతే పైరవీకారుల రాజ్యం పుట్టుకొస్తుంది. లంచావతారులు వస్తరు. ఏ చిన్నపనికైనా అధికారుల చుట్టూ ఏండ్ల తరబడి తిరగాల్సి వస్తది. పైసలు ముట్టజెప్పందే ఫైలు ముందుకు కదలదు. భూ రికార్డులు మారుతయ్. భూ దందాలు, సెటిల్మెంట్లకు తెరలేపడంతో గొడవలు, ఘర్షణలకు అవకాశం ఏర్పడుతుంది. అందుకే కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై రైతులు భగ్గుమంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతామని స్పష్టం చేస్తున్నారు.**



# ధరణి పోతే.. ధైర్యం చెడ్డట్టే..

## ధరణి తీసేస్తే ప్రతి పనికీ లంచం ఇవ్వాల్సిందే

ధరణి పోర్టల్ రాకముందు భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, పట్టాదారు పాస్‌పుస్తకం ఇలా ఏ పని కావాలన్నా లంచం ఇవ్వాల్సి వచ్చేది. సీఎం కేసీఆర్ ధరణి తీసుకొచ్చి భూముల వివరాలు ఆన్‌లైన్ చేయడంతో ఆ తిప్పలు తప్పాయి. ధరణి ఆధారంగానే అసలైన లబ్ధిదారులను ఎంపిక చేసి రైతుబంధు సాయం అందిస్తున్నరు. భూ సమస్యల కోసం అధికారుల కాడికి పోయే పని లేదు. ఏమన్నా ఉంటే ఆన్‌లైన్‌లోనే అర్జీ పెట్టుకుంటే అధికారులే స్వయంగా భూమి కాడికి వచ్చి చూసి పరిష్కరిస్తున్నరు. కాంగ్రెస్ పాలకులు ఉన్నప్పుడైతే చిన్న పనికి కూడా నెలల తరపున ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు మా పేరున ఉన్న భూమి రేపు ఎవరిపేరున ఉంటదో తెలియని పరిస్థితి ఉండేది. సీఎం కేసీఆర్ సార్ మా బాధలు అర్థం చేసుకుండు కాబట్టే ధరణి తీసుకొచ్చిండు. రైతుల కోసం పని చేసే బీఆర్‌ఎస్‌ను గెలిపించుకుంటాం.

**–పల్లా శ్రీనివాస్‌రెడ్డి, రైతు, గన్నెర్లపల్లి, చందంపేట మండలం**



## దళారుల రాజ్యంలో అష్టకష్టాలు పడ్డాం

రైతులను దగాచేసి, డబ్బులిచ్చే వాటికి దన్నుగా ఉండే పట్వారీ వ్యవస్థను మళ్లీ తీసుకొస్తామంటే మేము అంగీకరించం. రైతుకు మేలు చేస్తున్న ధరణి పోర్టల్ ఉండాల్సిందే . కాంగ్రెస్ పాలనలో రైతులు భూమి కొన్న, అమ్మినా, రికార్డుల్లో తప్పులు దొర్లినా అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. వారి చేతులు తడిపితే తప్ప పని అయ్యేది కాదు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణితో ఆ సమస్యలు లేకుండా పోయాయి. వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉండడంతో క్షణాల్లో పనులవుతున్నాయి. ఏ అధికారిని కలువాల్సిన పని లేదు. మీసేవా సెంటర్‌లో స్లాట్ బుక్ చేసుకొని సూచించిన తేదీకి తాసీల్దార్ కార్యాలయానికి వెళితే అరగంటలోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసి రికార్డుల్లో మార్చి బుక్‌లో ఎంటర్ చేసి ఇస్తున్నరు. ఇందుకు ఏ ఒక్కరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇంత మంచి ధరణి పోర్టర్‌ను తొలగిస్తామని కాంగ్రేసోళ్లు అనడం వెనుక కొంత మంది ప్రయోజనం దాగి ఉంది. పాత రికార్డు కాలమ్స్ పునరుద్ధరించి కౌలు దారు పేరును కూడా చేర్చడం వల్ల రైతుల మధ్య నిత్యం గొడవలే. మళ్లీ దళారులు, పైరవీకారులు, అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి మాకొద్దు. ధరణి తీసుకొచ్చిన బీఆర్‌ఎస్‌కే మేమంతా మద్దతు ఇస్తాం

**– బొబ్బ శేఖర్‌రెడ్డి, రైతు, రాయినిపాలెం, మిర్యాలగూడ మండలం**

## ధరణి పోతే దళారులు వస్తరు

ధరణి పోతే మళ్లీ దళారులు వస్తరు. ప్రతి పనికి ఒక రేటు పెట్టి రైతులను పీల్చి పిప్పి చేస్తరు. ధరణి వచ్చాక మా భూమి మాకు పక్కాగా కంప్యూటర్‌లో నమోదై ఉంది. ఊర్లలో గొడవలు లేకుండా పోయాయి. కానీ తాము ధరణి తీసేసి పాత విధానం తీసుకొస్తామని కాంగ్రెస్ వాల్లు చెబుతున్నరు. ధరణి తీసేస్తే మళ్లీ గొడవలు మొదలవుతాయి. కౌలుదారు చట్టంతో కూడా తలనొప్పే. ఒక భూమిలో యజమాని ఒకరుంటే మరొకరు కౌలు దారులు ఉంటారు. మరో చోట కబ్జాదారులు వేరు ఉంటారు. దాని వల్ల గందరగోళ పరిస్థితులు నెలకొంటాయి. కానీ ధరణి వచ్చిన తర్వాత అలాంటివి లేకుండా రికార్డుల్లో భూ యజమాని పేరు మీదనే ఉండడంతో రైతులు ప్రశాంతంగా ఉన్నారు. పాత పద్ధతి వస్తే మళ్లీ గందరగోళ పరిస్థితి ఏర్పడి ప్రశాంతంగా ఉన్న గ్రామాలల్లో రైతులు తన్నుకునే రోజులు వస్తాయి. రైతు బంధు కూడా ఎలా ఇస్తారు. ధరణి తీసేస్తే మాలాంటి పేద రైతులకు కష్టాలే మిగులుతాయి. ధరణికే మా మద్దతు ఇస్తాం.

**–మర్రి మాధవి, రైతు, ఉరుమడ్ల, చిట్యాల మండలం**



## కౌలుదారు చట్టంతో రైతులకు నష్టం



ధరణి తీసేసి కౌలు దారు చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ వాళ్లు అంటున్నారు. కౌలు చట్టంతో రైతులకు ఇబ్బందులు తప్పవు. పాత పటేల్, పట్వారి వ్యవస్థను తీసుకొస్తే భూ హక్కుదారుడు అన్యాయమైపోతడు. భూమిపైన అతను హక్కులు కోల్పోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ధరణి వల్ల ఎలాంటి కష్టాలు లేకుండా హాయిగా ఉన్నం. సంతోషంగా ఉన్న రైతులను చూసి కాంగ్రెసోళ్లు ఓర్వడం లేదు. ధరణి ఉన్నట్లయితే రైతు తన భూ పట్టాను మార్పిడి చేయాలంటే యజమాని స్వయంగా ఫింగర్‌ప్రింట్ ఇస్తేనే ఇతరులకు మార్పిడి అయ్యే అవకాశం ఉంటుంది. పాత పద్ధతి అంటే అధికారులే తమ ఇష్టమొచ్చినట్లు మార్చుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్రంలో 55 ఏండ్ల పాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ కూడా రైతుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పుడు రైతులకు మంచి జరుగుతుంటే జీర్ణించుకోలేకపోతున్నారు. భూ రికార్డులను పట్వారీల చేతిలో పెడ్తామంటే రైతులం ఒప్పుకోం. కౌలుదారు చట్టంతో పట్టాదారుల్వెరూ తమ భూములు ఇంకొకరికి కౌలుకు ఇవ్వరు. దాంతో మాలాంటి చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ధరణిని కొనసాగించే వారికే మేము ఓటేస్తాం.

**– ఎడ్ల చందర్‌రావు, రైతు, అడవిదేవులపల్లి**

## ధరణి లేకుంటే రైతులకు ఇబ్బందులే

ధరణిని తీసేసి ఇంకోటి పెడ్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నరు. ధరణి లేక పోతే మళ్లీ రైతుల బతుకులు ఆగమే. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి వల్లనే భూమి ఎవరి పేరుమీద ఉంది.. ఎంత ఉంది అనేది ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. భూమి అమ్మాలన్నా, ఇతరులకు పట్టా చేయాలన్నా మేము స్వయంగా వెళ్లి వేలి ముద్ర వేస్తేనే అవుతుంది. అది కూడా అరగంటలోనే పూర్తవుతున్నది. ఇదివరకి పట్టా మార్పిడికి నెలలు, సంవత్సరాలు తిరగాల్సి వచ్చేది. అది కూడా ఎవరికి రూపాయి ఇవ్వకుండా చేసుకునే వీలుంది. ప్రస్తుతం ధరణితో తాసీల్దార్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ అవుతున్నాయి. వెంటనే భూమి పత్రాలు ఇస్తున్నారు. అట్లాంటి ధరణిని తీసేస్తామని, పాత కాలం నాటి వ్యవస్థను తీసుకొస్తామని కాంగ్రెసోళ్లు చెబుతున్నరు. పాత విధానం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నరనే కొత్త విధానం తీసుకొస్తే దానిని తీసేసి మళ్లీ పాతదే తెస్తామనడం వెనుక అర్థమేంటి. ధరణి తెచ్చిన వాళ్లకు.. ధరణిని కొనసాగించే బీఆర్‌ఎస్ పార్టీకే మా మద్దతు. దానికి వ్యతిరేకంగా మాట్లాడే వారికి ఓటుతోనే బుద్ధి చెప్తాం.

**– కొండారెడ్డి జగాల్‌రెడ్డి, చింతలగూడెం, మాడ్గులపల్లి మండలం**

